ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 12 జనవరి 2025







స్వగ్రామాలకు చేరుకునేందుకు..

- స్వగ్రామాలకు చేరుతున్న వలస జీవులు
- రద్దీగా మారుతున్న రైల్వేస్టేషన్లు, కాంప్లెక్స్‌లు
- కిటకిటలాడుతున్న మార్కెట్లు

సంక్రాంతి శోభ

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి):

సిక్కోలులో సంక్రాంతి సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల్లో ఉన్న వలసజీవులంతా పండుగ నేపథ్యంలో స్వగ్రామాలకు వస్తున్నారు. అలాగే పాఠశాలలకు, కళాశాలలకు కూడా శుక్రవారం నుంచి సెలవులు ప్రకటించడంతో.. వివిధ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులంతా ఇళ్లకు చేరుకుంటున్నారు. దీంతో రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ కాంప్లెక్స్‌లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ప్రధానంగా శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ కనిపించింది. మరోవైపు ప్రైవేటు బస్సులు, వాహనా ల్లో కూడా అధికంగా రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే మార్కెట్లకు సంక్రాంతి శోభ వచ్చింది. వస్త్రాలు, బంగారం ఆభరణాలు, కిరాణా సామ గ్రి, ఇతర వస్తువుల కొనుగోలు కోసం చాలామంది శ్రీకాకుళం వస్తుంటారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం నగరంలోని జీటీ రోడ్డు, నెహ్రూ బజార్, చిన్నబజార్, పెద్ద మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యాయి. నెహ్రూ రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా ఆటోలు, కార్లు వంటి వాహనాలను పరిమిత సమయాల్లో మాత్రమే అనుమతిస్తున్నారు. ఉదయం 10 నుంచి 12 వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు ద్విచక్ర వాహనాలు మాత్రమే పోలీసులు అనుమతిస్తున్నారు.



శ్రీకాకుళంలోని ఓ వస్త్ర దుకాణంలో కొనుగోలుదారుల సందడి



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో..

ఆ గ్రామాలు.. భోగికి దూరం

- తరతరాలుగా.. కొనసాగుతున్న ఆచారం
- పండుగ ముందు శనివారమే బసివలసలో సంక్రాంతి

నరసన్నపేట/ జలుమూరు/గార, జనవరి 11(ఆంధ్రజ్యోతి):



లింగాలవలస గ్రామం

సంక్రాంతి వచ్చిందంటే.. ఊరూ వాడా సందడే సందడి. భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగను మూడురోజుల పాటు కుటుంబ సభ్యులు, బంధువులు ఘనంగా జరుపుకొంటారు. భోగి రోజు నుంచే పండుగ సందడి మొదలవుతుంది. కాగా.. జిల్లాలో కొన్ని గ్రామాలు మాత్రం వివిధ కారణాలతో తరతరాలుగా భోగికి దూరంగా ఉంటున్నాయి.

- నరసన్నపేట మండలంలో బసివలస, చింతువానిపేట, సుందరాపురం, గోకయ్యవలస, చోడవరం గ్రామాల్లో కొన్ని తరాల నుంచి భోగి పండుగను జరుపుకోవడం లేదు. బసివలస, చింతువానిపేట గ్రామాల్లో 150 సంవత్సరాలకు ముందు.. భోగి రోజు కొట్లాట జరిగి కొంతమంది మృతి చెందారు. అప్పటి నుంచీ భోగి పండుగను జరుపుకోరాదని ఆనాడు పెద్దలు నిర్ణయించారు. అప్పటి నుంచీ ఆ పెద్దల నిర్ణయాన్ని గౌరవిస్తూ.. గ్రామస్థులు నేటికీ భోగి మంటలు వేయడం లేదు. అలాగే బసివలసలో సంక్రాంతి రోజు కూడా ఎవరూ పెద్దలను పూజించరు. సంక్రాంతికి ముందు వచ్చే శనివారం పెద్దలకు పూజిస్తారు. తరతరాలుగా ఈ ఆచారం కొనసాగుతోందని గ్రామస్థులు చెబుతున్నారు. అలాగే తమ పూర్వీకులు ఎవరూ భోగి మంటలు వేయలేదని, ఆ ఆచారాన్ని తాము కూడా పాటిస్తున్నామని సుందరాపురం గ్రామస్థులు తెలిపారు.

లింగాలవలసలో.. పులి దాడి చేసిందని..

- జలుమూరు మండలం లింగాలవలస గ్రామస్థులు కూడా తరతరాలుగా భోగి పండుగకు దూరంగా ఉంటున్నారు. ఈ గ్రామంలో 500కుపైగా ఇళ్లు ఉన్నాయి. ఇళ్లకు వచ్చే చుట్టాలు, బంధువులు సంతోషంగా గడిపి పండగ వాతావరణం ఉన్నా.. ఈ గ్రామంలో మాత్రం భోగి మంట వేయరు. సుమారు వందేళ్ల కిందట లింగాలవలసలో వేకువజామున భోగి మంట వేసిన యువకుడిపై పులి దాడి చేసి చంపేసిందని.. అప్పటి నుంచీ తాము భోగి మంట వేయడం లేదని గ్రామస్థులు తెలిపారు. పూర్వీకుల ఆచారాన్ని కొనసాగిస్తున్నామన్నారు.



చింతువానిపేట గ్రామం

బూరవిల్లిలోనూ..

- గార మండలం బూరవిల్లి గ్రామస్థులు కూడా భోగి పండుగను చేసుకోరు. పండుగ నేపథ్యంలో దూరప్రాంతంలో ఉపాధి పొందుతున్న వలసజీవులు స్వగ్రామానికి చేరుకుంటారు. అలాగే ఆడపిల్లలు, అల్లుళ్లు, బంధువులు వస్తారు. కొత్త వస్త్రాలు ధరిస్తారు. సంక్రాంతి, కనుమ, ముక్కనుమ అందరిలాగే ఘనంగా జరుపుకొంటారు. కానీ భోగి మంట మాత్రం వేయరు. పెద్దలు కాలం నుంచీ ఈ ఆచారం కొనసాగుతోందని గ్రామస్థులు చెబుతున్నారు. అలాగే ఈ గ్రామంలో ఉగాది రోజు రైతులు ఏరువాక పూజ చేయరు. తర్వాత మరో రోజు ప్రత్యేకంగా ఏరువాక చేస్తారు. నాగులచవితి కూడా షష్టి రోజు చేస్తారు. దీపావళి, దసరా రోజుల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.



బూరవిల్లి గ్రామం


సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాం



గ్రామంలో పూర్వీకులు ఆచరించిన ఆచారం, సంప్రదాయాలను ఇప్పటికీ పాటిస్తున్నాం. గ్రామంలో భోగి మంట వేసిన వారికి ఏదో ఒక నష్టం సంభవిస్తుందన్న భయం ప్రతి ఒక్కరిలో ఉంది. అందుకే గ్రామంలో ఎవరూ భోగి మంట వేయకుండా సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాం.

- దుంగ స్వామిబాబు, మాజీ సర్పంచ్, లింగాలవలస, జలుమూరు

సరదాగా గడుపుతాం



భోగి రోజున కుటుంబ సభ్యులమంతా సరదాగా గడుపుతాం. భోగి మంట మాత్రం వేయం. మా పూర్వీకుల నుంచీ ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ఒకప్పుడు ఒక వీధిగా ఉన్న లింగాలవలసలో ప్రస్తుతం ఆరు వీధులైనా.. ఎక్కడా భోగి మంట వేయం.

- పంచిరెడ్డి అప్పలస్వామి, వృద్ధుడు, లింగాలవలస, జలుమూరు

తరతరాలుగా..



తరతరాలుగా వస్తున్న సంప్రదాయం మేరకు భోగి మంటలు వేసుకోవడం లేదు. పూర్వం గ్రామంలో భోగి రోజున తగాదాల కారణంగా భోగి మంటలు వేయలేదు. నాటి నుంచి ఈ ఆచారం కొనసాగిస్తున్నాం.

-సురంగి నర్సంగరావు, చింతువానిపేట, నరసన్నపేట

ముందే సంక్రాంతి



మా గ్రామంలో భోగి మంటలు వేయం. సంక్రాంతికి ముందుగా వచ్చే శనివారం నాడు గ్రామంలో పెద్దలకు పూజిస్తాం. మిగతా గ్రామాల కంటే ముందే మా గ్రామంలో సంక్రాంతి జరుపుకొంటాం. గ్రామ ఆచారం మేరకు ఇప్పటికీ ఆ పద్ధతి కొనసాగిస్తున్నాం.

- రెడ్డి గోవిందరావు, బసివలస, నరసన్నపేట

సంప్రదాయంగా వస్తోంది



మా గ్రామంలో భోగి పండగ రోజున భోగిమంట వేయకపోవడం అనేది సంప్రదాయంగా వస్తోంది. తాతముత్తాతల కాలంనాటి నుంచి ఇదే కొనసాగుతోంది. నాగుల చవితిని కూడా అందరిలా కాకుండా సుబ్రహ్మణ్య షష్ఠి నాడు నిర్వహిస్తాం.

- ఆరవెల్లి సీతారామస్వామి, గ్రామ పురోహితుడు, బూరవిల్లి, గార

మా గ్రామానికి ప్రత్యేకత

మా గ్రామానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఏడాది పొడుగునా ఉత్సవాలు జరుగుతుంటాయి. ఎంతో చారిత్రక ప్రసిద్ధి చెందిన ఈ గ్రామంలో ఎన్నో ఆలయాలు ఉన్నాయి. పెద్దల కాలం నుంచి కూడా ఈ గ్రామంలో భోగి పండగ నిర్వహించడం లేదు.

- మళ్ళ నర్సునాయుడు, బూరవిల్లి, గార

ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

- మంత్రి అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్న

కోటబొమ్మాళి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యకార, పాడిపరిశ్రమల శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ధాన్యం కొనుగోలు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు ఉంటే త్వరితగతిన పరిష్కరించాలి. రైతులు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే'నని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. రైతులు ధాన్యం విక్రయించిన నాలుగు గంటల్లో వారి ఖాతాలో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. అలాగే యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరించి.. సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ నేతలు ఎల్ఎల్ నాయుడు, బగాది శేషు తదితరులు ఉన్నారు.

సమీకృత కలెక్టరేట్ నిర్మాణాన్ని పూర్తి చేయండి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శనివారం శ్రీకాకుళంలో నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ కార్యాలయ భవన సముదాయాన్ని ఆయన పరిశీలించి, పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నూతన కలెక్టరేట్ ఆవరణలో పార్కింగ్, సెక్యూరిటీ, ప్రహరీ నిర్మాణం తదితర పనులపై ఆర్ అండ్ బీ ఎస్ఈ, కాంట్రాక్టు ప్రతినిధి వివరించారు. నాణ్యతలో రాజీ లేకుండా నిర్మాణ పనులు పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, కలెక్టరేట్ ఈవో జి.సూర్యనారాయణ, కాంట్రాక్టు ప్రతినిధి ప్రసాద్ పాల్గొన్నారు.

రేపు 'మీ కోసం' రద్దు

శ్రీకాకుళం క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భోగి పండుగ సందర్భంగా ఈ నెల 13న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆ రోజున జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల వేదిక.. 'మీ-కోసం' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు.

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ







ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత






కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మీ (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

మళ్లీ రావాల పాత రోజులు

- అందరూ కలసి సేసుకోవాల మన పండుగ
- గ్రామీణుల్లో ఆశాభావం

శ్రీకాకుళం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి)



● 'ఏటిరోయ్ ఎంకటేసు ఎప్పుడొచ్చినావురా?' ఆప్యాయంగా అడిగాడు నూకరాజు.

➡ ఓరి నూకా ఏటి సెప్పమంతావురా? బాగా పొద్దుపోనాది. రాత్రి లాస్టు బస్సుకొచ్చినానురా. గొప్ప సలిరా. నానెప్పుడూ ఇంత సలిని సూడలేదురా. బస్సు మీదొచ్చినపుడు వనికిపోనాను. ఆమదాలవలస రైలుటేసన్‌లో దిగినప్పుడే పొద్దుపోనాదిరా. బస్టాండ్‌కొచ్చి బస్సెక్కీసినాను. మరి ఇంకేటి సంగతులురా?.. తిరిగి ప్రశ్నించాడు ఎంకటేసు.

● 'బెంగులూరులో పని ఎలాగుందిరా?'.. కుతూహలంగా అడిగాడు నూకడు.

➡ 'ఏం పని... ఏం బతుకురా. ఊర్లోన ఉన్నంత హాయి రాదురా. ఏటయినా ఊరు ఊరేనిరా. అక్కడుంతే యంత్రమనుకో. ఒక సరదా ఉండదు.. సంతోసం ఉండదు. టౌన్‌లో ఉన్నామన్న మాటే గానీ, మనంత అభిమానం అక్కడ మనుసుల్లో ఉండదురా. పోనీ ఊర్లో ఉంతామంతే ఆదాయముండదురా. పిల్లల సదువులు, పెల్లుల్లు, కట్టం సుఖానికి డబ్బులు ఉండాలి కదరా. యవసాయం పెద్దగా గిట్టుబాటు కాదురా. అక్కడైతే రోజంతా కట్టపడితే ఎయ్య రూపాయలు దొరుకుతాయిరా. అంత ఆదాయం ఇక్కడ దొరకదు కదరా. పోనీ నా తగువేనికి గానీ.. నీ పరిత్తితేటిరా నూకా?'.... ప్రశ్నించాడు ఎంకటేసు.


● 'ఏటి సెప్పమంతావురా.. నీలాగ తెగించి పట్నం రాలేనురా. నానొత్తే యవసాయం ఎవులు సెత్తార్రా? అప్పుడంతే కౌలుకు ఇచ్చేవాల్లం. కానీ ఇప్పుడు ఎవుడూ యవసాయం సెయ్యడు. అలాగని ఉన్న భూమి వదులుకుంతామా?. అందుకే కట్టమైనా.. నట్టమైనా యవసాయం సేత్తన్నను. యవసాయం సేలా ఇబ్బందిరా. మొన్న ఇలాగ సేను కోసినామో లేదో వాన పట్టుకుందిరా. సేలా రోజులు సికండిలాగా వదల్లేదు. సేని తడిసి పడిపోయింది. పొలంలో దానిం రాలిపోయి నయి. మొలకలు వచ్చినాయిరా. శాలా లాస్ అయిపోనాం. కుటమాంతోని కట్టపడ్డామా. ఆ కట్టానికి తగినట్టు కూడా రాలేదురా. అందుకే ఈ ఏడు యవసాయం సెయ్యను అనుకుంతన్నాను. నీతోనే వత్తానురా. నాకు పని సూడురా'.. అని కోరాడు నూకరాజు.

➡ పోనీలేరా నూకా. పని సూత్తాను కానీ నీవు ఉండలేవురా. ఊరికి అలవాటు పడినోడువు. మన ఊరిలాగా కాదురా. అక్కడ పలకరించినోలుండర్రా. నెల తిరిగే సరికి డబ్బులైతే ఉంతాయిరా. ఆ డబ్బు సూసి పొంగిపోడమే గానీ.. ఏముండదురా. పిల్లల సదువులు, పెల్లిల్ల కోసం తప్పదు ఉండాలంతే ఉండాలి. మనసు అంగీకరించదు రా. సెప్పురా నూక. మనం సిన్నప్పుడు ఎంత హాయిగా ఉండేవాలమో. అందరం గంజి నీలు తాగి బతికినోలుమే గదరా. కానీ ఇప్పుడు అలాగున్నాదేటిరా పెపంచం? అల్లొడు డబ్బులు గడించినాడు.. అల్లొడు పిల్లలకు బాగా సూత్తన్నాడు. సదివిత్తన్నాడు...ఇదే గదా ఇప్పుడు వరస. ఆడినీ.. ఈడినీ సూసి పట్నమెలతన్నంరా. పోనీ పంటలైనా పండతన్నాయా అంతే అదీ లేదు. పొలానికి నీరు అవసరమైనపుడు వాన పడదు. అవసరం లేనపుడు వాన కురిసి తెగ కట్ట పెట్టేత్తన్నాది. అందుకే ఆ బతుకేదో టౌన్‌లో అయితే జీతం గేరెంటీ గదరా. అందుకే కట్టమైనా టౌన్ ఎలతన్నాను. పోనీసేరా. మీ ఇంటోల్లతో మాటాడి సెబితే... కాంటాక్టరు బాబుకు నాను సెబుతాను. పండుగ ఇరిగితే నాతో పాటు వత్తువు గానీ. ఒరే పండుగంతే గుర్తొచ్చింది... ఏట్రా పండుగ సరదా లేదు.'... ఎంకటేసు నిట్టూర్చాడు.

● 'ఏం పండుగరా ఎంకటేసు. తొలిలాగా ఊర్లోనా పెద్దగా సందడి నేదు. కుర్రాలున్నారంతే సెల్‌పోన్లు పట్టుకుంతన్నారు. ఆడోలు సీరియల్లు, సినిమాల్లో పడిపోతన్నారు. మందేసినోడు మందేసుకుంతన్నాడు. అందుకేనిరా పెద్ద సరదా లేదు. అప్పుడు మన టైములో పండుగంతే పండుగేనిరా. అందరం కొత్త బట్టలు ఏసుకొని అమ్మోరు దగ్గిరికి ఎల్లోలం కదరా. రాత్రిదాకా ఆటలు, పాటలు ఆ సరదా యేరులేరా. మనుసులు మారిపోనారు. కాలం మారిపోనాది. ఆ సరదా.. ఆ సందడి.. ఆ పేమలు, బంధాలు ఇప్పుడు లేవురా.'. బాధ పడ్డాడు నూకడు.

➡ 'పోనీలేరా. గుర్తు తెచ్చుకొని ఆనంద పడిపోదుమ. మళ్లీ పాత రోజులు రావాలిరా.. మనూర్లో ఆ పండుగ సందడి కనిపించాలిరా. వత్తాయనే ఆశ ఉందిరా. మరి ఎల్లొత్తానురా. అలాగ ఈదిలో పనుంది' అంటూ కదిలాడు ఎంకటేసు.





క్రీడాకారులకు ఉజ్వల భవిత

- ఎమ్మెల్యే గౌతు శిరీష



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే శిరీష

పలాస, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో 41వ రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడాకారుడిగా తయారవ్వాలని, జిల్లా కీర్తిని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకు వెళ్లాలని ఆకాంక్షించారు. గతంలో క్రీడలకు ప్రోత్సాహం ఉండేది కాదని... కూటమి ప్రభుత్వం అధి కారంలోకి వచ్చిన తరువాత అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. బాలురతో సమానంగా బాలికలు పాల్గొంటున్నారని... వారికి ప్రోత్సాహం అందిస్తామన్నారు. అంతకుముందు ఆమె క్రీడ, జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. విద్యార్థుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలు ప్రారంభించారు. పి.తవిటయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ టీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, టంకాల రవిశంకర్ గుప్తా, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, జోగ మల్లి, కొరికాన శంకర్, డాక్టర్ ఎం.మల్లేశ్వరరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ మజ్జి పున్నయ్య, పీఈటీలు శేఖర్ బాబు, హరి, పద్మలోచనరావు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఘనంగా ధనుర్మాస పూజలు

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వైష్ణవాలయాల్లో ధనుర్మాస పూజలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గోదాదేవికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శ్రీకాకుళం నగరంలోని పి.ఎన్.కాలనీలో ఉన్న నారాయణ తిరుమలలో అర్చకులు జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో కూడారై ఉత్సవాన్ని శనివారం నిర్వహించారు. 108 రకాల పిండి వంటలను స్వామి వారికి నైవేద్యంగా పెట్టారు. వేంకటేశ్వర స్వామికి, అలివేలు మంగకు ప్రత్యేకంగా అలంకరించారు. దూదివారి వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి తులసి మాలలతో పూజలు చేశారు. కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. శివ బాలాజీ ఆలయంలో స్వామి వారికి ప్రత్యేకంగా అలంకరించారు. పాలకొండ రోడ్డులో ఉన్న కోదండ రామాలయం, అరసవల్లిలోని రమ్య తిరుమలలో తిరుప్పావై ప్రవచనాలు, కూడారై ఉత్సవం నిర్వహించారు.



శివ బాలాజీ ఆలయంలో...



నారాయణ తిరుమలలో భక్తులు..

గోవులను సంరక్షించాలి

సరుబుజ్జిలి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు అంతరించిపోతున్న గోవులను ప్రతి ఒక్కరు బాధ్యతగా సంరక్షించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ పిలుపునిచ్చారు. శనివారం నందికొండ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో అభివృద్ధి పథకంలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న గోవులకు ఎమ్మెల్యే రవికుమార్ పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడే ఈ గోకులం షెడ్లను మంజూరు చేసి నిర్మాణాలు చేపడుతున్న సమయంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడి వాటిని నిర్లాక్ష్యంగా నిలుపుదల చేసిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల పాలనలో రాష్ట్రంలో 12,500 గోకులం షెడ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రైతు ఇంటి ముందు ఉండే గోవులు ప్రస్తుతం పెద్దగా కనిపించడం లేదని, మళ్లీ ఆ విధానాన్ని కొనసాగించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు గోవులను సంరక్షించడానికి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎండ రామారావు, దవల సింహాచలం, ఇలాకుల ప్రభాకర్, కొమనాపల్లి రవికుమార్, శివ్వాల సూర్యనారాయణ, అంబళ్ల రాంబాబు, నందివాడ గోవిందరావు, పేడాడ మణి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి బెడ్స్ వితరణ

కవిటి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మాణిక్యపురం గ్రామంలోని ప్రాథమికి ఆరోగ్యకేంద్రానికి ట్రూ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ మంచాలు, బెడ్స్, సెలైన్ స్టాండ్స్‌ను శనివారం అందించారు. ఈ కేంద్రంలో రోగులకు అవసరమైన సదుపాయాలు లేవని తెలుసుకొని వీటిని అందించామని సంస్థ వ్యవస్థాపకులు డాక్టరు ఎస్.క్రిష్ణంరాజు అన్నారు. మారుమూల గ్రామాల్లో నిరుపేదలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈసంస్థను స్థాపించామని తెలిపారు.ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు డాక్టరు ఎస్.క్రిష్ణంరాజును గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ లలితాసాహు,వైద్యులు సురేష్,లతశ్రీ, ఎంపిటిసి సత్యవతి సాహు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాప్టిస్ట్ మహాసభ

సోంపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంధ్రబాప్టిస్ట్ చర్చిలో శనివారం మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీఎన్‌సీ కార్యదర్శి ఏడీకే జాన్ మాట్లాడుతూ.. బాపిస్టు సంఘాల బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. సమావేశంలో కొత్తపల్లి అబ్రహం, కె.సుభద్ర తదితరులు ఉన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



జి.సిగడాం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సౌజన్యంతో కూటమి నాయకుడు, సర్పంచ్ బోగాది అప్పలనాయుడు ఆధ్వర్యంలో మదుపాంలో 150 మంది నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఏటా సంక్రాంతి సందర్భంగా పేదలకు దుస్తులు దానం చేసి నిరుపేదలకు, దివ్యాంగులకు, వృద్ధులకు ఆదుకోవడం మంచి కార్యక్రమమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి బాష, గ్రామస్థులు జాక రామారావు, పి.దాలయ్య, జాక కృష్ణ, బి.పరశురాం తదితరులు పాల్గొన్నారు.

గార పోలీసు స్టేషన్ పరిశీలన

గార, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గార పోలీస్ స్టేషన్‌ను శనివారం ఉదయం డీఎస్పీ వివేకానంద వార్షిక తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. మండలంలో శాంతిభద్రతలు పరిరక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. పరిశీలనలో సీఐ పైడపునాయుడు, ఎస్ఐ ఆర్.జనార్దనరావు ఇతర సిబ్బంది ఉన్నారు.

నదీ జలాలు కలుషితం చేయొద్దు



మురుగు కాలువను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

గుజరాతీపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర పర్యావరణ అధ్యయన యాత్రలో భాగంగా శనివారం జనవిజ్ఞాన వేదిక పర్యావరణ సబ్‌కమిటీ నగరంలోని పర్యటించారు. కోడి రామ్మూర్తి స్టేడియం దరిలోగల నాగావళి నది, కోటీశ్వరుని ఆలయ వద్దనున్న పరివాహక ప్రాంతాలు సందర్శించారు. నగరంలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి నదిజలాలు కలుషితం చేస్తున్నాయని వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ అన్నారు. నదీ జలాల్లోకి మురికినీటిని శుద్ధి చేసిన తర్వాత విడిచిపెట్టానలని కోరారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కె.కామేశ్వరరావు, పి.గోవిందరావు, పి.ధర్మారావు, సీహెచ్ కృష్ణారావు, ఎ.వాసుదేవరావు, పి.జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు

● రథసప్తమి ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే శంకర్



రథసప్తమి ఏర్పాట్లపై ఎమ్మెల్యే శంకర్‌కు వివరిస్తున్న శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద

అరసవల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి రథసప్తమి సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈ మేరకు రథసప్తమికి సంబంధించి తొలగిస్తున్న భవనాలను, జరుగుతున్న ఏర్పాట్లను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రథసప్తమిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించడం జిల్లా వాసుల అదృష్టమన్నారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ స్థలం, క్యూలైన్లో వచ్చే సాధారణ భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయ పరిసరాలను పోలీసులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఆలయ ఈవో వై.భద్రాజీ, డీఎస్పీ వివేకానంద, సీఐ పైడపునాయుడు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వేలంపాట ఖరారు

అరసవల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత, అరసవిల్లి సూర్యనారాయణ స్వామివారి రథసప్తమి వేడుకల పనులకు సంబంధించిన సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలంపాట నేడు ఖరారు అయింది. విద్యుద్దీపాలంకరణలో ఉంగటి పాపారావు రూ.22,90,000 ఖరారు కాగా, క్యూలైన్ల ఏర్పాటుకు పిల్లా మౌళికి రూ.3,19,000, రంగులు వేయడానికి డి.రాజారావు రూ.1,80,000లకు ఖరారు చేశారు. అలాగే ఫొటోలు, వీడియో, ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటుకు, టీ, టిఫిన్, భోజనాలకు, సీసీ కెమెరాలకు సంబంధించి మళ్లీ వేలంపాట త్వరలో నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వై.భద్రాజీ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ చైర్మన్ ఇప్పిలి జోగిసన్యాసిరావు, శ్రీకూర్మం ఆలయ ఈవో జి.గురునాథం తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు.. వడ్డే ఓబన్న

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



అరసవల్లి: ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ పుండ్కర్



శ్రీకాకుళం క్రైం: నివాళులర్పిస్తున్న ఏఎస్పీ రమణ

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధుడు వడ్డే ఓబన్న అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, బీసీ సంక్షేమ అధికారిణి బి.అనూరాధ, కలెక్టరేట్ ఏవో సూర్యనారాయణ, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుత్తు చిన్నారావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

శ్రీకాకుళం క్రైం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన గొప్ప పోరాట యోధుడు వడ్డే ఓబన్న అని ఏఎస్పీ కేవీ రమణ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి ఏఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. 1807 జనవరి 11న నంద్యాల జిల్లా సంజమల మండలం నొస్సం గ్రామంలో ఓబన్న జన్మించారన్నారు. సామాన్యుని హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి ఓబన్న అని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీతో పాటు ఎస్‌బీ సీఐ ఇమ్మాన్యుయల్ రాజు, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోజా అవినీతిపై విచారణ చేపట్టాలి: ఎమ్మెల్యే కూన



విలేకరులతో మాట్లాడుతున్న రవికుమార్

ఆమదాలవలస, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీటీడీ దర్శనం టిక్కెట్లు అమ్ముకున్నట్లు ఆరోపణలు ఉన్న అప్పటి మంత్రి ఆర్కే రోజాపై కూటమి ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆ యన పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల తిరుపతిలో వైకుంఠ ఏకాదశి దర్శన టిక్కెట్ల క్యూలైన్‌లో జరిగిన దురదృష్టకరమైన ఘటనను వైసీపీ నాయకులు రాజకీయం చేయడం సిగ్గు చేటన్నారు. ఘటన జరిగిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రుల బాధితులను పరామర్శించడంతో పాటు పరిహారాన్ని అందించి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకున్నారన్నారు. అదేవిధంగా ఈ ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఐదేళ్ల వైసీపీ పాలనలో టీటీడీలో జరిగిన కుంభకోణాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల మండలంలోని చిన్నజొన్నవలస గ్రామంలో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలతో ఆక్రమణ స్థలాల్లో నివాసం ఉంటున్న గృహాలను తొలగించిన బాధితులకు సమీప ప్రాంతంలో గృహ నిర్మాణాలకు సంబంధించిన ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్నెపు భాస్కరరావు, ఎండ అప్పలనాయుడు, నాగళ్ల మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి: విప్ అశోక్



కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ అశోక్

సోంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి కనిపిస్తోందని విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. రామయ్యపట్నంలో పాఠశాల ప్రహరీకు శనివారం శంకుస్థాపన, ఎంపీ నిధులతో నిర్మించి కమ్యూనిటీ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, టీడీపీ నాయకులు జీకే నాయుడు, మద్దిల నాగేశ్వరరావు, సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు, మద్దు రాజారావు, నిట్ట గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పండగకు ఊరెళ్తున్నారా.. జాగ్రత్త



అవగాహన కల్పిస్తున్న వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణ

శ్రీకాకుళం క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ సందర్భంగా మీ ఇంటికి దొంగలొస్తారు జాగ్రత్త అంటూ ఒకటో పట్టణ పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 19 వరకు స్కూల్స్, కళాశాలలకు సెలవులు కావడంతో కుటుంబాలతో సొంత ఊరు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని వన్‌టౌన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ కోరారు. స్టేషన్ పరిధిలో ఆటోకి బ్యానర్‌రు పెట్టి మైక్‌లో ప్రచారం చేశారు. ఊరెళ్లే వారు పోలీసు స్టేషన్‌కు సమాచారం అందిస్తే గస్తీ నిర్వహిస్తామని, ఎల్‌హెచ్ఎంఎస్ సౌకర్యాన్ని కల్పిస్తానమని తెలిపారు.

దేహ దారుఢ్య పరీక్షల్లో 265 మంది అర్హత



ఎంపికలు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు మైదానంలో శనివారం నిర్వహించిన దేహ దారుఢ్య పరీక్షల్లో 265 మంది అర్హత సాధించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో ఈ పరీక్షలు నిర్వహించారు. 660 మంది అభ్యర్థుల హాజరుకావల్సిఉండగా, 414 మంది హాజరయ్యారు. కాగా సంక్రాంతి పండగ సెలవులు ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈ తేదీల్లో దేహదారుఢ్య పరీక్షలు ఉండవని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ నెల 16న తిరిగి ఈ ఎంపికలు చేపడతామని స్పష్టం చేశారు.

గోకులాలతో రైతులకు చేయూత

శ్రీకాకుళం రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గోకులాల ఏర్పాటుతో రైతులకు చేయూతగా ఉంటుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బైరి గ్రామంలో శనివారం గోకులాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం 268 గోకులాలు నిర్మిస్తే, మేం ఆరు నెలల్లో 12,500 గోకులాలు నిర్మించామని తెలిపారు. రైతుల ఆదాయం రెట్టింపు అవ్వాలనేది గోకులాల పథకం ఉద్దేశం అన్నారు. రాష్ట్రంలో డెయిరీ కోఆపరేటివ్ సొసైటీలు 10శాతం మాత్రమే ఉన్నాయని, వీటిని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

● రణస్థలం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జేఆర్ పురం పంచాయతీ పరిధిలోని సీతంవలసలో శనివారం ఎచ్చెర్ల నియోజకవర్గం జనసేన పార్టీ అధ్యక్షుడు విశ్వక్సేన్ మినీ గోకులాన్ని ప్రారంభించారు. పాడి రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు వద్దాది శ్రీను, దాసరి బలరాం, అప్పలకొండ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

లావేరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ అన్నారు. శనివారం అప్పాపురంలో మినీ గోకులం షెడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి రైతుకు ప్రభుత్వం ప్రోత్సాహకంగా మినీ గోకుల షెడ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. వీటిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ సర్పంచ్ గంట్యాడ మహేష్, పీఏ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల తరలింపుపై నిఘా

ఇచ్ఛాపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల తరలింపుపై ప్రత్యేక నిఘా పెట్టామని సీఐ మీసాల చిన్నమనాయుడు తెలిపారు. తనిఖీల్లో భాగంగా రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో తనిఖీలు చేపట్టామన్నారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

ఎచ్చెర్ల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం స్వామి వివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పుష్కలంగా ఉన్న వివేకానందుడి ఆశయాలు నేటి యువతకు ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.ముకుందరావు, పీవోలు వి.సింహాచలం, బి.శ్రీధర్, జి.ఈశ్వరరావు, టి.అసిరినాయుడు, సింధుజ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.



వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

యువతకు స్ఫూర్తి.. స్వామి వివేకానంద

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): యువ రచయితల వేదిక ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమం శనివారం కేంద్ర గ్రంథాలయావరణలో వ్యవస్థాపక అధ్యక్షురాలు తంగి ఎర్రమ్మ పర్యవేక్షణలో నిర్వహించారు. రోటరీ క్లబ్ ప్రతినిధి కిల్లాన శ్రీనివాసరావు మాట్లాడుతూ.. స్వామి వివేకానంద చూపిన మార్గంలో యువత నడవాలన్నారు. ఈ సందర్భంగా యువ రచయితల వేదికకు నూతన అధ్యక్షుడిగా పి.నాగభూషణం, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు, మహిళా కార్యదర్శిగా వాసవి, ముఖ్య సలహాదారులు యం.శంకర రావు తదితరులు ఎన్నికయ్యారు.



వ్యసనాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ కార్యక్రమానికి అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోని అగ్ర కంపెనీల్లో 12 నెలల పాటు పరిశ్రమల అనుభవం కల్పించనున్నారు. అలాగే రూ.6 వేలు సింగిల్ గ్రాంట్, ప్రతీ నెలా రూ.5 వేలు చొప్పున ఒక ఏడాది పాటు అందజేస్తారని తెలిపారు. పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన కింద బీమా సదుపాయం కూడా ఉంటుందాన్నరు. ఈ నెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు ఏపీఎస్ఎస్‌డీసీ కమాండ్ కంట్రోల్ రూమ్ 99888 53335, 87126 55686, 87901 18349, 95532 28843 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్లాట్‌ఫారం టిక్కెట్లపై ఘర్షణ

ఇచ్ఛాపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారం టిక్కెట్ల కోసం టిక్కెట్ కలెక్టర్ పాసింజర్స్‌తో ఘర్షణ పడ్డారు. శనివారం స్టేషన్‌లో ప్రయాణికులకు తోడుగా వచ్చిన తోటి వారిని ప్లాట్‌ఫారం టిక్కెట్ అడిగారు. ఎప్పుడూ లేనిది కొత్తగా ఏంటని టిక్కెట్ కలెక్టర్‌తో తగాదా పడ్డారు. టిక్కెట్ లేనందున ఫైన్ కట్టాలని చెప్పడంతో పాసింజర్లు గొడవకు దిగారు. అనంతరం చివరికి వారిని విడిచిపెట్టారు. ఇకపై స్టేషన్ ప్లాట్‌ఫారంలోకి వచ్చిన ప్రతీ ఒక్కరూ ప్లాట్‌ఫారం టిక్కెట్ తీసుకోవాలని తెలిపారు.

వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా చిట్టిబాబు

ఇచ్ఛాపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాంపత్ని చిట్టిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జడ్పీ చైర్‌పర్సన్, నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. చిట్టిబాబు మండల సెక్రటరీగా, బూత్ మేనేజర్‌గా, జేసీఎస్ బూత్ కన్వీనర్‌గా పార్టీకి సేవలు అందించారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న కలగ శ్రీను

శ్రీకాకుళం రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న పెద్దపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కలగ శ్రీనివాసరావును శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అభినందించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలగ శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే శంకర్ టీడీపీ శాశ్వత సభ్యత్వ ధ్రువపత్రాన్ని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వ నమోదు చురుగ్గా చేపట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.





ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి రైలు దిగిన ప్రయాణికులు

రైల్వేస్టేషన్‌లో సంక్రాంతి రద్దీ

ఇచ్ఛాపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ సంక్రాంతి రద్దీగా మారింది. ముఖ్యంగా శనివారం రాత్రి వైజాగ్ నుంచి బరంపురం వెళ్లే ఇంటర్ సిటీ రైలు నుంచి ఇచ్ఛాపురం స్టేషన్‌లో సుమారు వెయ్యి మంది ప్రయాణికులు వరకు దిగారు. రైలు నుంచి దిగిన పాసింజర్లతో పాటు వాళ్లను తీసుకెళ్లేందుకు వచ్చిన బంధువులతో రైల్వే స్టేషన్ కిటకిట లాడింది. రైల్వే వంతెన ప్రయాణికులతో జాతరాలా మారింది. పండుగ సెలవులు కావడంతో దూరప్రాంతాలతో పాటు వైజాగ్‌లో చదువుతున్న విద్యార్థులు, ఉద్యోగులు స్వగ్రామానికి చేరుకున్నారు. రైలు నుంచి దిగిన ప్రయాణికులు దూర ప్రాంతాలకు రాత్రిపూట వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. రాత్రిపూట కావడం ఆటో డ్రైవర్లు ఎక్కువ ధరలు అడగడంతో ఎటూ తోచక ఎక్కువ డబ్బులు చెల్లించి స్వగ్రామాలకు చేరుకున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

ఇచ్ఛాపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పండగ సందర్భంగా ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డా చర్యలు తప్పవని సీఐ మీసాల చిన్నమనాయుడు తెలిపారు. కుటుంబ సమేతంగా హ్యాపీగా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని తెలిపారు. పేకాట, కోడి పందాలు, వంటివి ఆడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. పండుగ సందర్భంగా పట్టణాన్ని వదిలి వేర్వేరు గ్రామాలకు వెళ్లినట్లయితే ఇంటికి తాళాలు వేసి సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అపరిచిత వ్యక్తులను తారాసపడితే సమాచారం ఇవ్వాలని కోరారు.





మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు

● వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శనివారం మండలంలోని రేగులపాడులో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన మినిగోకులం (గోశాల) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలుచేసి తీరుతామన్నారు. రాష్ట్రంలోధ్వంసమైన రోడ్ల నిర్మాణాలు ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయన్నారు.లింగాలపాడుకు లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరుచేసి పంటలకు నీరు అందించేందుకు కృషి చేశామన్నారు. రాష్ట్రంలో ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యతలు ప్రైవేటు యాజమాన్యాలకు ఇవ్వనుండడంతో ప్రతీ ఎకరాకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, పశుసంవర్థకసంయుక్త సంచాలకులు మురళీధర్, రేగులపాడు సర్పంచ్ ప్రభాకర్, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, ఏపీవో హరిప్రసాద్, నాయకులు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, ఎన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పశుసంపదను పెంచుకోవాలి

● పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

మెళియాపుట్టి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పశుసంపదను పెంచుకోవాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. శనివారం మండలంలోని శేఖరాపురంలో గోశాలను ప్రారంభించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ పాడిపరిశ్రమ రైతులు ఆర్థికంగా ఎదగడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన రైతులు ముందుకు తీసుకురావడానికి ఉపాధి నిధులతో షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రైతులను అప్పుల ఊబిలోకి నెట్టేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో పశుసంవర్థశాఖ జేడీ కంచరాన రాజగోపాల్, ఏడీ మంచు కరుణకరరావు, ఎంపీడీవో ప్రసాద్‌పండా, ఏపీవో రవి పాల్గొన్నారు.



గోశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంజీఆర్



పైపులైన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస,జనవరి 11(ఆంధ్రజ్యోతి):పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో శాశ్వతంగా తాగునీటి కొరత తీర్చడానికి చర్యలు తీసుకుంటున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. శనివారం జంటపట్టణాల్లోని హడ్కో, శాంతినగర్‌కాలనీల్లో మంచినీటి పైపులైన్లకు శంకుస్థాపనచేశారు. కార్యక్రమంలో చైర్మన్ బళ్ల గిరిబాబు, వైస్‌చైర్మన్ మీసాల సురేష్ బాబు, వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఎ.రామకృష్ణ, కమిషనర్ ఎన్.రామారావు, డీఈఈ కనకరాజుతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

●పలాస ఆర్టీసీ డిపో ఆవరణలో రెండు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను శిరీష ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, డీఎం ఆర్.సీతారామనాయుడు,ఆర్.సంతోష్ కుమార్, నాగరాజు, నవీన్, రవిశంకర్‌గుప్తా, జోగ మల్లి, శంకర్ పాల్గొన్నారు.

కేంద్రం సాయంతో ప్రాజెక్టుల నిర్మాణం

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సహాయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులను నిర్మిస్తుందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. శనివారం పట్టణంలోని జగన్నాథపురం, దేవాంగులవీధి, కిలుగువీధి, కామేశ్వరినగర్‌లో అంతర్గత రోడ్లను, చిక్కాలవలస పంచాయతీ కుద్దాంలో సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, టీడీపీ నాయకులు శిమ్మ చంద్రశేఖర్, జల్లు చంద్రమౌళి, గొద్దు చిట్టిబాబు, ముంజి రంగనాయకులు, శ్రీరాములు, పీస కృష్ణ, నేతింటి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

● పోలాకి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గొల్లలవలస పంచాయతీలో తోటాడ నుంచి డోల రోడ్డును కలుపుతూ నిర్మించిన బీటీ రహదారిని ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి ప్రారంభించారు.



నరసన్నపేట: సీసీరోడ్డు ప్రారంభిస్తున్న బగ్గు రమణమూర్తి

చికిత్సపొందుతూ వేర్వేరు చోట్ల ఇద్దరి మృతి

జిల్లాలో వేర్వేరు చోట్ల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులు చికిత్సపొందుతూ శనివారం మృతిచెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

లింగాలవలసలో ఒంటరి జీవనం సాగించలేక..

జలుమూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) మండలంలోని లింగాలవలస గ్రామానికి చెందిన సాధు రామన్న (55) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ అశోక్‌బాబు, స్థానికుల కథనం మేరకు... రామన్న భార్య సరోజిని రెండేళ్లకిందట మృతిచెందింది.కుమార్తె తులసికి వివాహం కాగా కుమారుడు విశ్వనాథం హైదరాబాద్‌లో ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు.దీంతో ఒంటరి జీవనం సాగించలేకపోయాడు. ఈనేపథ్యంలో శుక్రవారంసాయంత్రం ఇంటివద్ద ఎవరూలేని సమయంలో పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పురుగులు మందు అస్వస్థతకు గురికావడడంతో కుటుంబ సభ్యులు గమనించి 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు.ఒంటరి జీవనంతో మనస్థాపం చెంది పురుగులు మందు తాగినట్లు రామన్న కుమార్తె సాధు తులసి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

నిజామాబాద్‌లో యువకుడు..

గార, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ గ్రామానికి చెందిన యువకుడు బైరి రామరాజు (20) చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఏఎస్ఐ టి.చంద్రమోహన్ కథనం మేరకు..రామరాజు విశాఖపట్నానికి సమీపంలోని ఓ ప్రైవేట్‌కంపెనీలో ఉద్యోగంచేస్తున్నాడు.శ్రీకాకుళం రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమించాడు. ఆమెప్రేమను తిరస్కరించంతో.. ఈనెల 9న గడ్డిమందు మద్యంలో కలిపితాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్సనిమిత్తం తొలుత శ్రీకాకుళం రిమ్స్‌కు.. అక్కడి నుంచి విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెదాడు. రామరాజు తల్లి కల్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

లక్ష్మీనర్సుపేటలో ఆర్టీసీ డ్రైవర్ మృతి

ఎల్.ఎన్.పేట/టెక్కలి,జనవరి 11(ఆంధ్రజ్యోతి):లక్ష్మీనర్సుపేట పంచాయతీ పరిధిలోగల ఇందిరానగర్‌కాలనీకి చెందిన ఆర్టీసీ డ్రైవర్ బి.అప్పలరాజు(53) శనివారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. టెక్కలి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా అప్పలరాజు పనిచేస్తున్నాడు. శుక్రవారం విధులు నిర్వహించి ఇంటికి చేరుకున్నాడు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో నిద్రలోనే గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టెక్కలి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ బీఎస్ఎన్ మూర్తి, అసోసియేషన్ నాయకులు అప్పలరాజు దహన సంస్కారాల కోసం 15 వేల రూపాయలు కుటుంబ సభ్యులకు అందజేశారు. అప్పలరాజుకు భార్య మంగమ్మ, కుమార్తె, కుమారుడుతోపాటు తల్లి ఉన్నారు.

7,400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

● 1,140 లీటర్ల సారా స్వాధీనం
● ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో ఉమ్మడిగా దాడులు



ఏపీ-ఒడిశా ఎక్సైజ్ సిబ్బంది దాడుల్లో పట్టుబడిన సారా

పాతపట్నం, జనవరి11(ఆంధ్రజ్యోతి):ఆంధ్రా-ఒడిశాసరిహద్దు ప్రాంతంలో బెల్లంఊట, సారా తయారీపై ఇరురాష్ట్రాల అధికారులు శనివారం ఉమ్మడిగా దాడులు నిర్వహించారు. పాతపట్నం ఎక్సైజ్‌శాఖ సీఐ కోట కృష్ణారావు కథనం మేరకు..ప్రొహిబిషన్ ఎండ్ ఎక్సైజ్ శ్రీకాకుళం డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాబ్జీరావు, ఒడిశాలోని గంజాం జిల్లా డిప్యూటీ కమిషనర్ బిభూతి భూషణల సంయుక్త సారథ్యంలో ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో దాడులు నిర్వహించారు.ఒడిశాలోని సింగుపూర్, శిరడా, గురిసింగిగూడ తమిలిగూడ, నేరేడగూడతోపాటు పలు మారుమూల గ్రామాల్లో ఇరురాష్ట్రాల ప్రొహిబిషన్, ఒడిశా పోలీస్ శాఖ సిబ్బంది తనిఖీచేశారు. దాడుల్లో 7400 లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసంచేశారు. 1140 లీటరు సారాను స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ డీపీఈవోతిరుపతినాయుడు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈ ఎస్‌డీవీజీరాజు ఒడిశా డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ ఎక్సైజ్ బిభూతి భూషణ పర్యవేక్షణలో జరిగిన దాడుల్లో శ్రీకాకుళం ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఈఎస్ టాస్క్‌ఫోర్స్, శ్రీకాకుళం, పలాస, పాతపట్నం, కొత్తూరు, ఆమదాలవలస, నరసన్నపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు, గజపతి జిల్లా ఎక్సైజ్, పోలీస్‌శాఖ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సారాతో ముగ్గురి అరెస్టు

పలాసరూరల్, జనవరి11(ఆంధ్రజ్యోతి): లొద్దభద్ర పంచాయతీ శాసనం గ్రామానికి చెందిన కుప్పిలి రామారావు, తంగుడు గణేష్‌ను ఎక్సైజ్ అధికారులు 80లీటర్ల సారాతో అరెస్టు చేశారు. అలాగే కేశుపురానికి చెందిన అంబలి విశ్వనాథానికి 4.6 లీటర్ల సారాతో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

కలిగాం జంక్షన్‌లో మద్యం సీసాల స్వాధీనం

కొత్తూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిగాం జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీచేశారు.ఈ మేరకు కలిగాం గ్రామానికి చెందిన మొదలవలస పాపారావు 14 మద్యం సీసాలు, ఐదు బీరు బాటిల్స్ తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ఎస్ఐ అమీర్ అలీ కేసు నమోదు చేశారు.

సందడిగా రంగోయిలో కళాజాతర సంబరాలు

పలాస రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగోయిలో గిడుగు రామమూర్తి తెలుగుభాష ,జానపద కళాపీఠం 21వ వార్షిక జానపద కళాజాతర సంబరాలు శనివారం సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రిన్సిపాల్ మజ్జి పున్నయ్య, కళింగసీమ సాహిత్య సంస్థ అధ్యక్షులు సన్నశెట్టి రాజశేఖర్ తదితరులు మాట్లాడుతూ సంప్రదాయ కళలను పరరిక్షించి ముందు తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు.అనంతరం వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు పాటలను ప్రదర్శించారు.

పోతురాజు నాట్యం..జముకుల పాటలు

తోటరమణమ్మ, తపాల మహాలక్ష్మి ఉడుపులు, గైరమ్మ పాటలు, ఒడిశా జంగాలపాడుకు చెందిన కళాకారులు జముకుల పాటలు, సింహాద్రి అప్పన్న డోల పాటలు,రేగులపాడు తప్పెటగుళ్లబృందంనృత్యాలను ప్రదర్శించారు. గేదెల భీముడు ఎరుకుల పాటలు, పి.ధనుంజయరావు బుర్రకథ, భైరిసారంగపురం గంగిరెద్దులు, అసిరయ్య జానపద గీతాల ప్రదర్శన, అనంతపురం జిల్లా వెంకట రమణ ఆధ్వర్యంలో జానపదపాటలు, కూచిపూడినాట్యం, కోలాటం, భిలాయ్‌కు చెందిన కె.చిరంజీవులు జానపద గీతాలు, మిమిక్రీ, రాజమండ్రి బృందంతో పోతురాజు నాట్యం, మడ్డు తిరుపతిరావు గణితావధానం, దేవుడిపాటలు, మ్యాజిక్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బద్రి కూర్మారావు, కళాకారులు కుమార్‌నాయక్, తెప్పల కృష్ణమూర్తి, డాక్టర్ కె.చిరంజీవులు, ఆయా ప్రాంతాలకు చెందిన కళాకారులు, రంగోయి గ్రామస్థులు పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న రేగులపాడు తప్పెటగుళ్ల కళాకారులు

ప్రజల ఆదాయం పెంచడమే లక్ష్యం

పలాస రూరల్,జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆదాయం పెంచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. శనివారం మండలంలోని లొత్తూరు పంచాయతీ దానగొరలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.1.82 లక్షలతో మంజూరైన మినీ గోకులాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే కార్యక్రమంలో భాగంగా పాడిరైతులకు ఉపయోగపడేలా మినీగోకులం ఏర్పాటు చేశామని తెలిపారు. లబ్ధిదారులకు ఉపయోగపడేలా షెడ్లను ఏర్పాటుచేశామని,దీంతో వారి ఆదాయశాతం పెరిగే అవకాశముందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్, టీడీపీ మండలాధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణకుమార్, ఎంపీడీవో ఎన్.వసంత్‌కుమార్, పశుసంవర్థకశాఖ సహాయసంచాలకులు చంద్రశేఖర్, ఏపీవో శంకరరెడ్డి పాల్గొన్నారు.

●వజ్రపుకొత్తూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సైనూరులో గోశాలను ఎమ్మెల్యే శిరీష ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సైని యోగి, పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, దున్న షణ్ముఖరావు గోవిందు పాపారావు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు చెత్త తరలింపు



చెత్త తరలింపు పనులు పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

వజ్రపుకొత్తూరు, జనవరి11(ఆంధ్రజ్యోతి):పూండి-గోవిందపురం పంచాయతీలో గతంలో ఎక్కడిపడితే అక్కడే చెత్త వేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారని, వాటిని దృష్టిలో ఉంచుకొని డంపింగ్ యార్డుకు చెత్త తరలించామని రాష్ట్ర అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ తెలిపారు. క్లీన్ అండ్‌గ్రీన్ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పూండిలో కొన్నేళ్లుగా పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గునాలపాడు పెట్రోల్‌బంక్ పక్కనే ఉన్న డంపింగ్‌యార్డుకు చెత్తను తరలించే కార్యక్రమం రెండురోజులుగా చేపడుతున్నట్లు తెలిపారు.

సౌత్ జోన్ క్రికెట్ పోటీలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

నరసన్నపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట క్రికెట్ సబ్‌సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్న శిమ్మ సాత్విక్, ఎన్.జోగిందర్ సౌత్ జోన్ అంతర రాష్ట్ర క్రికెట్ పోటీలకు అండర్ -14 విభాగంలో క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారని కోచ్ కె.శ్రీనివాసరావు, వైఎంసీఏ కార్యదర్శి గొద్దుచిట్టిబాబులు శనివారం తెలిపారు. ఈనెల 27 నుంచి వచ్చే నెల 18 వరకు పాండిచ్చేరిలో సౌత్ జోన్ అంతర రాష్ట్ర క్రికెట్ పోటీల్లో వీరు ఆడనున్నట్లు చెప్పారు. సాత్విక్, జోగిందర్‌లు ఎంపిక పట్ల కోచ్ శ్రీనివాసరావు, చిట్టిబాబులు అభినందించారు.

పోరంబోకు భూములను గుర్తించండి: తహసీల్దార్



మాట్లాడుతున్న తహసీల్దార్ సోమేశ్వరరావు

నందిగాం,జనవరి11(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో పోరంబోకు భూములను గుర్తించాలని తహసీల్దార్ పెద్దింటి సోమేశ్వరరావు సూచించారు. శనివారం నందిగాంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమలస్థాపనకు సమన్వయంతో పనిచేసి పోరంపోగు భూముల వివరాలను అందజేయాలని కోరారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సమావేశంలో ఉపతహసీల్దార్ ఆర్.రామారావు, మండల సర్వేయర్ వానుమంతరావు, ఆర్ఐ సింహాచలం పాల్గొన్నారు.

మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

మెళియాపుట్టి, జనవరి11(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని సీపీఎంఎల్ న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. మెళియాపుట్టి మూడురోడ్ల కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి తహసీల్దార్‌కార్యాలయం వద్ద ఆందోళనచేశారు. ఈసందర్భంగా న్యూ డెమోక్రసీ రాష్ట్రకార్యదర్శి వంకల మాధవరావు మాట్లాడుతూ సాయుధగిరిజన రైతాంగ పోరాటం తర్వాత దేశవ్యాప్తంగా ఐటీడీఏలు ఏర్పాటుచేశారన్నారు. ఎనిమిది నియోజకవర్గాలతో ఏర్పడిన జిల్లాలో 16 మండలాల్లో గిరిజనులు ఉన్నారన్నారని తెలిపారు.వైసీపీ ప్రభుత్వం ప్రజల అభిప్రాయం తెలుసుకోకుండానే జిల్లాలను విభజించిందని ఆరోపించారు. జిల్లాలోని గిరిజనులుకు ఐటీడీఏ లేకపోవడంతో ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు యోగి, మామిడి భీమారావు, వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న న్యూడెమొక్రసీ నాయకులు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

● టెక్కలి సమీపంలో కారును ఢీకొన్న టిప్పర్ ● డ్రైవర్ పరారీ

టెక్కలి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): టెక్కలి సమీపంలో జాతీయ రహదారిపై శనివారం విశాఖ నుంచి పలాస వైపు వెళ్తున్న ఓ కారును టిప్పర్ ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు..పలాసకు చెందిన జి.సురేష్ కుటుంబసభ్యులతో కారులో వస్తుండగా టిప్పర్ ఢీకొంది. అయితే ఈ సంఘటనలో కారులో ఉన్న వారంతా క్షేమంగా బయటపడ్డారు. ఈ సంఘటనతో కారులో ఉన్నవారంతా భయభ్రాంతులకు గురయ్యారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. టిప్పర్ కారును ఢీకొన్న తర్వాత డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యాడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

తేరపల్లి గ్రామానికి బీటీ రోడ్డు

● సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

వజ్రపుకొత్తూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): తేరపల్లి గ్రామ జనసేన నాయకులు శనివారం సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా తేరపల్లికి రూ.కోటి 50 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించడంతో పాల అభిషేకం చేసినట్లు చెప్పారు.దశాబ్దాలగా గ్రామానికి బీటీరోడ్డు నిర్మించాలని ఎన్నిసార్లు వినతులు అందించిన ఫలితం లేకపోయిందని వాపోయారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరునెలల్లోనే రోడ్డు నిర్మించి మాట నిలబెట్టుకున్నారని తెలిపారు.కార్యక్రమంలో జనసేన పలాస నియోజకవర్గ ఇన్‌చార్జి వి.దుర్గారావు, నాయకులు ఎ.తులసీరావు, సునీల్‌వర్మ పాల్గొన్నారు.



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఇల్లు విడిచిపెట్టి వెళ్తే సమాచారం ఇవ్వండి

● టెక్కలిలో పోలీసుల ప్రచారం



టెక్కలి: ప్రచారంచేస్తున్న పోలీసులు

టెక్కలి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి టెక్కలినుంచి సొంత గ్రామాలకు వెళ్లేవారు తమ విలువైన వస్తువులు, నగదు బ్యాంకుల్లో భద్రపరచుకోవాలని సీఐ ఎ.విజయ్‌కుమార్ కోరారు. శనివారం పట్టణంలో ఆటోకు మైక్ ఏర్పాటుచేసి పలువీధుల్లో ప్రచారం నిర్వహించారు. ఎవరైనా ఇల్లు విడిచిపెట్టి వెళ్తే పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని, లాక్‌డ్ మోనటరింగ్ సిస్టమ్ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పండగ రోజుల్లో మద్యం తాగి అతివేగంగా వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించినా, కోడిపందాలు, జూదం ఆడినా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

●కొత్తూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):సంక్రాంతి సెలవులు నేపథ్యంలో బయట ఊళ్లకు వెళ్లే ఇంటి యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్ తెలిపారు. శనివారం కొత్తూరు పట్టణంలో ఆటోతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విలువైన బంగారం, వెండి, డబ్బులు లాకర్లలో భద్రపరచుకోవాలని, ఒంటరిగా ప్రయాణం చేసే మహిళలు చైన్‌స్నాచింగ్ దొంగలపట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.

బోసిపోతున్న వంశధార కాలువ

నందిగాం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లూరు, పెద్దతామరాపల్లి, హరిదాసుపురం, సుభద్రాపురం తదితర ప్రాంతాల్లోని వంశధార కాలువ నీరు లేక బోసిపోతోంది. ప్రధానంగా కాలువ ఆధారంగా తాగు,సాగునీటికి వినియోగిస్తున్నారు. అయితే జనవరి రెండో వారంలోనే నీటిని నిలిపివేయడంతో స్నానాలు, పశువుల దాహార్తి తీర్చడానికి రైతులు ఇబ్బందిపడుతున్నారు. ప్రధానంగా సంక్రాంతి పురస్కరించుకుని కాలువల్లో నీరు విడిచిపెట్టాలని పలువురు కోరుతున్నారు.

నేడు జానపద కళాజాతర

వజ్రపుకొత్తూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజాంలో సంక్రాంతి ఉత్సవాలు పురస్కరించుకుని ఆదివారం జానపద కళాజాతర నిర్వహించనున్నట్లు సిక్కోలు జానపద కళాజాతర అధ్యక్షుడు రాపాక ధనరాజు ఒకప్రకటనలో పేర్కొన్నారు. జానపద కళాకారులు ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

రేపు గోదాదేవి కల్యాణం

టెక్కలి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణం అర్చకులు సీహెచ్ రమణాచార్యులు నేతృత్వంలో నిర్వహించనున్నట్లు ఈవో వాకచర్ల రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో గోదాదేవి కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

సమస్యలపై పోరాటం

నరసన్నపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ పార్టీని బలోపేతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ కోరారు. శనివారం నరసన్నపేటలో వైసీపీ కార్యనిర్వాహక సభ్యులను అభినందించారు కార్యక్రమంలో పార్టీ నాయకులు బగ్గు రామకృష్ణ, చీపురు కృష్ణమూర్తి, రావాడ రామారావు, కరిమి రాజేశ్వరరావు, యాళ్ల శ్యామ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పలాస రూరల్, జనవరి11(ఆంధ్రజ్యోతి) :క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని రెంటికోట సర్పంచ్ శాసనపురి తిరుమల తెలిపారు. శనివారం మండలంలోని రెంటికోటలో సంక్రాంతిని పురస్కరించుకొని ఆర్‌పీఎల్ సీజన్-5 టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సద్గుణబాబు, ఖగేష్‌దొర, మహేష్‌హరియ, ప్రవీణడొక్కర, ఉమాపతి, ఆనంద్‌గుమ్మడి, బాలరాజు పాల్గొన్నారు.

దొంగతనాల నియంత్రణకు సహకరించండి: సీఐ

పాతపట్నం, జనవరి11(ఆంధ్రజ్యోతి): దొంగతనాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని సీఐ వి.రామారావు కోరారు. శనివారం పాతపట్నం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ సంక్రాంతి నేపథ్యంలో సొంత గ్రామాలకు కుటుంబాలతో వెళ్లే ప్రజలు తమ ఇల్లు దొంగలబారిన పడకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు వహించాలని కోరారు.

హెల్మెట్ ధరించాలి

వజ్రపుకొత్తూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్క వాహనచోదకులు హెల్మెట్ ధరించాలని ఎస్ఐ బి.నిహార్ తెలిపారు. శనివారం నగరంపల్లి జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించని వారిని గుర్తించి అవగాహన కల్పించారు.

వైద్య రంగానికి ప్రాధాన్యం ఇవ్వాలి

టెక్కలి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వైద్య రంగానికి ప్రాధాన్యం ఇవ్వాలని, జిల్లాలో మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.ఈ మేరకు శనివారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ టీవీ బాలమురళీకృష్ణ కలిశారు. ఇప్పటివరకు డీఎంహెచ్‌వోగా పనిచేసిన బొడ్డేపల్లి మీనాక్షి బదిలీ కావడంతో ఆమె స్థానంలో బాలమురళీకృష్ణ శనివారం విధుల్లో చేరారు.

అవగాహనతోనే కుష్టు వ్యాధి నియంత్రణ

నరసన్నపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అవగాహన ద్వారా కుష్టు వ్యాధి వ్యాప్తి చెందకుండా నియంత్రించవచ్చని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి. జగన్మోహన్‌రావు తెలిపారు. శనివారం స్థానిక లెప్రర్సీ కాలనీలోగల ఆసుపత్రిలో రోగులకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, దోమతెరలను పంపిణీ చేశారు. ఆసుపత్రిలో సేవలు పొందుతున్న ఎనిమిదిమందికి, మరో 17 మందికి కిట్లను అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు రమణ, ఎలిషా, డీసీవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.